సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



మోయలేని భారం
కేయూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థులపై ఫీజుల భారం పెరిగింది. మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు గతంతో పోల్చితే మూడింతలైంది. IIలో▸



వ్యర్థాలకు అర్థం!
సృజనాత్మక దృష్టి ఉంటే పనికిరాని వస్తువులు కూడా కళాకృతులవుతాయి. ఆదిలాబాద్ మున్సిపల్ అధికారులు సృష్టించిన వెస్ట్ టూ వండర్ పార్కే దీనికి నిదర్శనం. IIIలో▸

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా పోస్టల్ దినోత్సవం



పోస్టుమాస్టర్లను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఆదిలాబాద్: తెలంగాణ స్టేట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పోస్టల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో పోస్ట్‌మాస్టర్లను సన్మానించారు. యూనియన్ అధ్యక్షుడు జనగం సంతోష్ మాట్లాడుతూ.. 70ఏళ్లుగా పోస్టల్‌శాఖ సేవలందిస్తోందని, ప్రస్తుత మొబైల్ ఫోన్ల యుగంలోనూ అధునాతన సేవలు అందిస్తుండడం శుభపరిణామమని పేర్కొన్నారు. యూనియన్ ప్రతినిధులు దుర్గం రాజేశ్వర్, రాఘవేంద్రనాథ్ యాదవ్, రాంకిషన్, అమర్, జార్జ్, జగదీశ్, అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



బతుకమ్మ ఉత్సవాల్లో జాదవ్ గణేశ్

ఇంద్రవెల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ కళాశాల పనుల్లో నాణ్యత పాటించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జాదవ్ గణేశ్ సూచించారు. గురువారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడానికే అమ్మ ఆదర్శ కళాశాల కింద నిధులు మంజూరు చేసి పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు మధుకర్, ప్రమీల, సరితారాణి, వెంకటేశ్, పూర్ణచందర్, రవి ఉన్నారు.

26న లైసెన్స్‌డ్ సర్వేయర్ సప్లిమెంటరీ పరీక్షలు

కైలాస్‌నగర్: జిల్లాలో రెండు విడతల్లో నిర్వహించిన పరీక్షల్లో ఫెయిలైన లైసెన్స్‌డ్ సర్వేయర్ అభ్యర్థులకు ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించింది. ఈ నెల 26న వారికి రెండోసారి థియరీ, ప్లాటింగ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 23నుంచి 25వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనుంది. అభ్యర్థులు సబ్జెక్ట్‌కు రూ.500 చొప్పున మీ సేవ కేంద్రాల్లో ఈ నెల 15వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్ తెలిపారు.

'కపాస్ కిసాన్ యాప్ వద్దు'



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

బోథ్: సెంట్రల్ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్రవేశపెట్టిన 'కపాస్ కిసాన్' యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని సొనాల మండలంలోని చింతల్‌బోరి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తంజేశారు. యాప్‌ను బహిష్కరిస్తున్నట్లు వారు ప్రకటించారు. యాప్‌తో కొనుగోలు కేంద్రాల్లో పత్తి అమ్ముకోవడానికి ఇబ్బందులెదురవుతాయని తెలిపారు. ఈ మేరకు తమ సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గురువారం ఏవోకు వినతిపత్రం ఇచ్చారు.

ఏటీసీల్లో యువతకు శిక్షణ



పనులు పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) ఏర్పాటు చేసి యువతకు ఆధునిక సాంకేతిక వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ ఇస్తోందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. గురువారం కేబీ ప్రాంగణంలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను సందర్శించి నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా యువతకు సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి వృత్తి విద్య కోర్సులు అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేయించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

పరిషత్‌కు బ్రేక్

- జీవో 9పై స్టే విధించిన హైకోర్టు
- 'సుప్రీం'కు వెళ్తామన్న ప్రభుత్వం
- సర్కారుపై విపక్షాల విమర్శలు
- ఆదరిస్తేనే మద్దతు: బీసీ నేతలు



బజార్‌హత్నూర్‌లో ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ వేసేందుకు వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి, నాయకులు

సాక్షి, ఆదిలాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ పడింది. బీసీ రిజర్వేషన్ల జీవో 9, 'పరిషత్' ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించింది. గురువారం ఉదయం 10.30 గంటలకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికలు జరిగే మండలాల్లో ఆయా రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. అయినప్పటికీ హైకోర్టులో విచారణ ఉండడంతో ఎన్నికలు జరుగుతాయా.. లేదా? అనే సందేహం ఓ వైపు ఉంటే, నామినేషన్ వేయాలా.. వద్దా? అనే సంశయం ఆశావహుల్లో నెలకొంది. ఈ సందిగ్ధంలోనూ బజార్‌హత్నూర్ మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ వేశారు. జిల్లా వ్యాప్తంగా ఇదొక్కటే నామినేషన్ దాఖలు కావడం గమనార్హం. మధ్యాహ్నం నుంచి విచారణ ప్రారంభం కావడం, ఆ తర్వాత హైకోర్టు స్టే ఇవ్వడంతో ఈ ఎన్నికలు నిలిచిపోతున్నాయని తెలియడంతో ఆశావహుల్లో నిరుత్సాహం వ్యక్తమైంది.

సర్కారు ఎలా ముందుకెళ్తుందో!

జిల్లాలో మొదటి విడతలో 10 జెడ్పీటీసీ, 80 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ప్రభుత్వం ఇందుకు సంబంధించి గురువారం ఉదయం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత హైకోర్టు స్టే నేపథ్యంలో ఎన్నికలు నిలిచిపోయాయి. జీవో నంబర్ 9కి సంబంధించి స్టే ఇవ్వగా ఎన్నికల నోటిఫికేషన్ నిలిచిపోయినట్టేనని స్పష్టమైంది. ఆ తర్వాత ఎన్నికల కమిషన్ కూడా హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని తెలిపింది. ఎన్నికలు నిలిపివేస్తామని, 'కోడ్' తొలగిస్తామని ప్రకటించడంతో ప్రస్తుతం జారీ చేసిన రిజర్వేషన్లకు అనుగుణంగా ఈ ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనని స్పష్టమైంది. దీని తర్వాత రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుంది.. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయిస్తుందా.. లేనిపక్షంలో పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు మళ్లీ షెడ్యూల్ జారీ చేస్తుందా.. ఇలా వివిధ సందేహాల మధ్య ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషనైతే నిలిచిపోయింది.

ఆరోపణలు.. ప్రత్యారోపణలు

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కల్పనలో అధికార కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని బీఆర్‌ఎస్, బీజేపీ ఆరోపించాయి. ఎన్నికలపై స్టే విధిస్తూ హైకోర్టు తీర్పు వెలువడ్డాక సాయంత్రం ఆయా పార్టీల నాయకులు ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ విమర్శలు గుప్పించారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్‌కు పూర్తి చిత్తశుద్ధి ఉందని, దీనిపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకుంటామని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. కాగా, బీసీ కులాలకు మద్దతు ఇచ్చే ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలనే ఆదరిస్తామని జిల్లాకు చెందిన బీసీ సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు.

మద్దతిచ్చే పార్టీల వైపే బీసీలు



బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు మద్దతిచ్చే పార్టీల వైపే బీసీలుంటారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు ముందుకెళ్తాం. అగ్రవర్ణాల కారణంగా బీసీ రిజర్వేషన్లు నిలిచిపోయాయి. వారి కుట్రలు తిప్పి కొడతాం. – కలాల శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

కాంగ్రెస్‌ది రాజకీయ డ్రామా



రాజకీయ డ్రామాతో కాంగ్రెస్ బీసీలను వంచించింది. 42శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించినప్పుడే జాగ్రత్తలు తీసుకోవాలి. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదు. గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా ఎలా జీవో జారీ చేస్తారు? – పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

సుప్రీం కోర్టులో సాధిస్తాం



హైకోర్టు స్టే విధించినప్పటికీ బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. దీంట్లో ఎలాంటి సందేహం లేదు. కోర్టులో బలమైన వాదనలు వినిపించినప్పటికీ నిలువలేక పోయింది. సుప్రీం కోర్టుకు వెళ్లయినా సాధిస్తాం. దీనిపై పార్టీలో చర్చ సాగుతోంది.– కంది శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి

నిలువునా మోసగించింది



బడుగు, బలహీన వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్టనిలువునా మోసానికి గురిచేసింది. సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ల పేరిట మభ్యపెట్టారు. రాజకీయంగా లబ్ధి పొందాలనే బీసీలకు హామీలిచ్చారు. అమలులో చిత్తశుద్ధి కనబర్చలేదు. – జోగు రామన్న, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

సైన్స్‌పై ఆసక్తి పెంచడమే లక్ష్యం



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచడమే లక్ష్యమని జిల్లా సైన్స్ అధికారి ఆరే భాస్కర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణలో 'మానవజాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతికత' అంశంపై జిల్లా స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు శాస్త్ర స్ఫూర్తిని ప్రతిబింబించాయి. బంగారిగూడ మోడల్ స్కూల్ ప్రథమ, బరంపూర్ జెడ్పీహెచ్‌ఎస్ ద్వితీయ, ఇంద్రవెల్లి జెడ్పీహెచ్‌ఎస్ తృతీయ స్థానాల్లో నిలువగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన బంగారిగూడ విద్యార్థులు ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా సైన్స్ అధికారి తెలిపారు. హెచ్‌ఎంలు లచ్చిరాం, డైట్ కళాశాల పర్యవేక్షకులు మమత, శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం లక్ష్మణ్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

'బీసీ రిజర్వేషన్లపై సీఎంకు చిత్తశుద్ధి ఏది'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ డ్రామా చేస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని బీజేపీ శాసనసభాపక్ష ఉపనేత పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 42శాతం బీసీ రిజర్వేషన్లపై తాను అసెంబ్లీలో చర్చించానని, రిజర్వేషన్ అమలులో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించానని గుర్తు చేశారు. ఇలాంటి సమస్యలే మహారాష్ట్ర, కర్ణాటకలో వచ్చినట్లు తాను ఉదహరించానని వివరించారు. 42శాతం రిజర్వేషన్ పేరిట కాంగ్రెస్ బీసీలను ఆశల పల్లకిలో ఊరేగించిందని, ఏమీ కాకముందే కాంగ్రెస్ శ్రేణులు పాలాభిషేకాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా జీవో తీసి రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మోసం చేసేందుకే కుట్ర పన్నిందని మండిపడ్డారు. రిజర్వేషన్ల పేరిట బీసీలను మోసం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూసిందని ఆరోపించారు. రాష్ట్రంలో గందరగోళ పరిస్థితికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని, అప్పటివరకు బీసీల పక్షాన పోరాడుతామని వెల్లడించారు. ఆయన వెంట నాయకులు లాలా మున్నా, సంతోష్, మయూర్ చంద్ర, దయాకర్, విజయ్, దినేశ్ మాటోలియా, భీమ్‌సేన్‌రెడ్డి, రాందాస్, అశోక్, సన్నీ, విశాల్, రమేశ్ తదితరులున్నారు.

జిల్లాకు నీతి ఆయోగ్ పురస్కారాలు

- కార్యక్రమాల అమలులో సఫలం
- నాలుగు అంశాల్లో గుర్తింపు

కైలాస్‌నగర్: నీతి ఆయోగ్ కార్యక్రమాల అమలులో జిల్లా మరోసారి సత్తా చాటింది. కలెక్టర్ రాజర్షి షా కృషి ఫలితంగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది పలు అంశాల్లో పురస్కారాలు సాధించింది. 'యూజ్ కేస్ చాలెంజ్–నీటి ఫర్ స్టేట్స్' కార్యక్రమం కింద విద్య, సామాజిక అభివృద్ధి, ఆరోగ్యం–పోషణ విభాగాల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఇంప్రూవ్ సాఫ్ట్ స్కిల్స్ అమాంగ్ స్టూడెంట్స్ అనే యూజ్ కేస్ ఎడ్యుకేషన్ థీమ్ కింద జాతీయ విజేతగా నిలిచి రూ.2లక్షల బహుమతి సాధించింది. ఈ కార్యక్రమం విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం తదితర సాఫ్ట్ స్కిల్స్‌ను పెంపొందించడంపై దృష్టి సారించింది. ఈ అవార్డు ద్వారా నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద అమలు చేసిన 'ఇంగ్లిష్ ఫౌండేషన్ లెర్నింగ్ ప్రోగ్రాం'కు కూడా ప్రత్యేక గుర్తింపు లభించింది. నార్నూర్ మండలంలోని అన్ని పాఠశాలల్లో విజయవంతంగా అమలు చేసి విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేలా ప్రోత్సహించింది. విద్య, సామాజిక అభివృద్ధి, ఆరోగ్యం, పోషణ విభాగాల్లో అప్రిషియేషన్ అవార్డులు దక్కాయి. ప్రతీ అంశానికి రూ.లక్ష చొప్పున బహుమతి లభించింది. ఈ విజయాలు జిల్లా వినూత్న ఆలోచనలు, సమగ్ర అభివృద్ధి, ఆధారపూర్వక పాలనపై అంకితభావాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ అవార్డులతో జిల్లా మరోసారి విద్యారంగం, సామాజిక మార్పులో దేశంలోని ఇతర ఆశాజనక బ్లాక్‌లకు మార్గదర్శకంగా నిలిచింది.

సెక్టోరియల్ అధికారిపై సస్పెన్షన్ వేటు

కైలాస్‌నగర్: జిల్లా విద్యాశాఖలో సెక్టోరియల్ అధికారి (జండర్ ఈక్వాలిటీ కో ఆర్డినేటర్) గా పనిచేస్తున్న బీ ఉదయశ్రీపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు తెలంగాణ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జిల్లాలోని నార్నూర్ కేజీబీవీలో విద్యార్థినులకు పెట్టిన బ్రేక్‌ఫాస్ట్‌లో పురుగులు రావడంతో వారు భోజనం చేయకుండా ఆందోళనకు దిగారు. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ కేజీబీవీని సందర్శించి విచారణ చేపట్టారు. ప్రత్యేకాధికారిని విధుల నుంచి టర్మినేట్ చేశారు. కాగా, కేజీబీవీలను నిత్యం పర్యవేక్షిస్తూ విద్యార్థినులకు పౌష్టికాహారం అందించేలా చూడాల్సిన సెక్టోరియల్ అధికారి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సరైన పర్యవేక్షణ చేపట్టడంలేదని నిర్ధారించారు. ఈ మేరకు డిప్యూటేషన్‌పై కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, చార్జి మెమో జారీ చేయాలని జిల్లా విద్యాధికారిని ఆదేశిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.

'ఇందిరమ్మ'కు ఉపాధిహామీ

- అనుసంధానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- లబ్ధిదారులకు 90రోజుల పనిదినాలు
- నిర్మాణాల పెంపుపై సర్కారు దృష్టి
- అదనపు ప్రయోజనం కల్పించేందుకే..

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి వివరాలు

మంజూరైన ఇళ్లు	15,486
మార్కౌట్ ఇచ్చినవి	7,763
బేస్మెంట్ దశలో..	4,547
రూఫ్ లెవల్‌లో..	1,092
ఆర్‌సీ లెవెల్‌లో..	236
పూర్తయిన ఇళ్లు	02



కైలాస్‌నగర్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఆశించిన స్థాయిలో ముందుగుసాగడం లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం లబ్ధిదారులకు ఆర్థికభారం తగ్గించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ స్కీంకు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. తాజా నిర్ణయంతో జాబ్‌కార్డు కలిగిన కూలీలకు అదనపు ప్రయోజనం కలిగి ఆర్థిక సాంత్వన చేకూరనుంది. సర్కారు నిర్ణయంపై ఇందిరమ్మ లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

నిర్మాణాలు వేగవంతం చేసేలా..

ఇందిరమ్మ పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి ప్రభుత్వం 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులకు రూ.5లక్షల చొప్పున చెల్లిస్తోంది. ఇళ్ల నిర్మాణ దశలను అనుసరించి బిల్లులు చెల్లించనుంది. బేస్మెంట్ దశలో రూ.లక్ష, గోడల నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష, స్లాబ్ లెవల్ వరకు పూర్తయితే రూ.2లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తిస్థాయిలో జరిగాక రూ.లక్ష చొప్పున నాలుగు విడతల్లో అందజేస్తోంది. లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.లక్ష చొప్పున తక్షణమే ఆర్థికసాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానించాలని నిర్ణయం తీసుకుంది. తద్వారా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని భావిస్తోంది.

అదనపు లబ్ధి చేకూర్చేందుకే..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేసింది. ఉపాధి కూలీలకు 90రోజుల పనిదినాలు కల్పించాలని నిర్ణయించింది. రోజుకు రూ.307 చొప్పున 90రోజుల పనిదినాలకు గాను రూ.27,630 వారికి అదనంగా లబ్ధి చేకూర్చాలని భావిస్తోంది. అయితే బేస్మెంట్ స్థాయి వరకు 40 రోజులు, లెంటల్ స్థాయి వరకు 30 రోజులు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మరో 20రోజుల పాటు పని కల్పించనుంది. ఒకవేళ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే బేస్మెంట్ వరకు నిర్ణీత 90రోజుల పనిదినాలు పూర్తయితే మిగతా పనిదినాలను వచ్చే ఆర్థికసంవత్సరంలో ఇచ్చే వెసులుబాటు కల్పించింది. కూలీల వేతనాల చెల్లింపు కోసం నిర్మాణ పనుల్లోని మూడు దశల్లో లబ్ధిదారుడి ఫొటోలు తీసుకుని వాటిని ఆన్‌లైన్‌లో హౌసింగ్‌శాఖ అధికారులు అప్‌లోడ్ చేయనున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత పంచాయతీ సెక్రటరీ దాన్ని ధ్రువీకరించినట్లయితే దాని ఆధారంగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో బిల్లులు జమ కానున్నాయి. తద్వారా లబ్ధిదారు ఇంటి నిర్మాణాన్ని వేగవంతం చేసుకోవడంతో పాటు కూలీలకు చెల్లించే ఆర్థికభారాన్ని తగ్గించుకోన్నారు.

ఆందోళనలో అన్నదాతలు

- వరదలకు నీటమునిగిన పంటలు
- పెట్టుబడి ఖర్చులూ రాని దుస్థితి
- పరిహారం కోసం రైతుల నిరీక్షణ

సాత్నాల: ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా తయారైంది. భారీ వర్షాలు, వరదలతో వివిధ పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు కుమిలిపోతున్నారు. జిల్లాలోని పెన్‌గంగా పరీవాహక ప్రాంతాలైన భీంపూర్, భోరజ్, జైనథ్, బేల, సాత్నాల మండలాల్లో వేల ఎకరాల్లో పంట ముంపునకు గురైంది. భీంపూర్ మండలంలో 1,016 ఎకరాల్లో పత్తి, 53 ఎకరాల్లో సోయాబీన్, 16 ఎకరాల్లో కంది పంట లకు నష్టం జరిగింది. బేల మండలంలో పత్తి 1,400, సోయాబీన్ 550, కంది 50, భోరజ్ మండలంలో పత్తి 1,880, సోయాబీన్ 353, కంది 68, సాత్నాల మండలంలో పత్తి 285, సోయాబీన్ 80, కంది 40, జైనథ్ మండలంలో పత్తి 1,200, సోయాబీన్ 1,200, కంది 160ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

మానసిక ఒత్తిడికి లోనవుతూ..

పెన్‌గంగా పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. పత్తి, సోయాబీన్, కంది పంటలు నాశనమై రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉంది. ఆర్థికంగా ఇప్పటికే నష్టాల్లో ఉన్న రైతులు ఇప్పుడు పూర్తిగా విసిగిపోయారు. దిగుబడి రాదని ఆవేదనతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. భోరజ్ మండలంలో ఇప్పటికే ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రైతులు ఇప్పటికే ఎకరాకు రూ.15వేల వరకు పెట్టుబడి పెట్టారు. వేల ఎకరాల్లో పంట నష్టపోయిన నేపథ్యంలో ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తామని చెప్పడంతో ఎదురుచూస్తున్నారు. పంట నష్టంపై సర్వే చేసిన అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందించారు. అయినా ఇప్పటివరకు రైతులకు పరిహారం అందలేదు. ప్రభుత్వం నుంచి పరిహారం అందకుంటే ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం అందించాలి



భారీ వర్షాలు, వరదల కారణంగా ఎరువులు, విత్తనాల ఖర్చులు వృథా అయ్యాయి. ఇప్పటికే ఎకరానికి రూ.15వేల ఖర్చయింది, ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందించాలి. రబీ సాగుకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించి ఆదుకోవాలి. – సంతోష్‌రెడ్డి, పిప్పర్‌వాడ

ప్రభుత్వం ఆదుకోవాలి



భారీ వర్షాలతో ఇప్పటికే పంటలు కోల్పోయాం. రైతులకు ఆర్థికభారం కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రబీ సాగు కోసం రైతులకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలి. నష్టాల్లో ఉన్న రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి. – పట్టిపు విలాస్, పెండల్‌వాడ

వేలిముద్ర వేయాల్సిందే..

- పంటల కొనుగోళ్లలో కొత్త విధానం
- ఈ ఏడాది నుంచే అమలుకు చర్యలు
- దళారుల దందాకు చెక్ పెట్టేందుకే..

జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

పత్తి	4,40,000
సోయాబీన్	62,500
కంది	55,000
మొక్కజొన్న	23,000

ఇచ్చోడ/బోథ్: రైతులు పండించిన పంటలను కనీస మద్దతు ధరకు విక్రయించే ప్రక్రియలో దళారులు అడ్డుపడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'పీఎం–ఆశా' పథకం అమలు చేస్తూ కఠిన మార్గదర్శకాలు జారీ చేసింది. రైతు మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట అమ్ముకునే అవకాశం కల్పించింది. దీంతో దళారులకు చెక్ పడనుంది.

అక్రమాల నిరోధానికే..

పత్తి, సోయాబీన్, కంది, మొక్కజొన్న, వరి, పెసర లాంటి అనేక పంటలకు బహిరంగ మార్కెట్ ధరతో సంబంధం లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నాయి. అయితే, దళారులు గ్రామాల్లోకి వెళ్లి తక్కువ ధర చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, సీసీఐతో కుమ్మక్కై మద్దతు ధరకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. గతంలో పత్తి, సోయాబీన్, జొన్నల కొనుగోళ్లలో ఇలాంటి అవకతవకలకు పాల్పడినట్లు ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో రైతులకు 'మద్దతు' దక్కేలా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఈ మార్గదర్శకాలు తీసుకువచ్చింది.

కేంద్రాల్లో కొత్త విధానం

కొత్త నిబంధనల ప్రకారం పీఎస్‌ఎస్ పోర్టల్‌లో రైతులు తప్పనిసరిగా నమోదు కావాలి. రైతుల ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకం వివరాలతో పాటు వ్యవసాయశాఖ నుంచి క్రాప్ బుకింగ్ డేటా (పంట వివరాలు)ను సేకరించి ధ్రువీకరించుకోవాలి. ఈ డేటా మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, సీసీఐ లాంటి నోడల్ ఏజెన్సీలతో అనుసంధానం అవుతుంది.

బయోమెట్రిక్ లేకుంటే అంతే..

రైతుల పేరిట దళారులు పంటలు విక్రయించకుండా కీలక నిబంధన తీసుకువచ్చారు. కొనుగోలు కేంద్రంలో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ లేదా మొబైల్ యాప్ ద్వారా ముఖ గుర్తింపు ద్వారా పంటలు కొనుగోలు చేయనున్నారు. ఓటీపీ ద్వారా ధ్రువీకరణకు ఇకపై అనుమతి లేదు. ఇందుకు ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాల్లో ఈపోస్ యంత్రాలు అమర్చనున్నారు. వీటి ద్వారా కొనుగోళ్లు జరగనున్నాయి.

డబ్బులు నేరుగా రైతు ఖాతాకే..

పంటలు అమ్ముకున్న రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమవుతాయి. ఒకవేళ రైతు నేరుగా కొనుగోలు కేంద్రానికి రాలేని పక్షంలో, తన ఆధార్‌పై గరిష్టంగా ముగ్గురు అధీకృత వ్యక్తులకు అవకాశం ఇవ్వవచ్చు. అధీకృత వ్యక్తి పంట తెచ్చినా చెల్లింపు మాత్రం రైతు ఖాతాకే వెళ్తుంది. ఈ మార్పులన్నీ కొనుగోలు ప్రక్రియను మరింత పారదర్శకంగా ఉంచేందుకు ఉద్దేశించినవని కేంద్రం స్పష్టం చేస్తోంది.

దళారులకు చెక్ పడుతుంది



కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే. ఈ పథకం అమలతో దళారులు దొడ్డి దారిన పంటలు విక్రయించడానికి అవకాశం లేకుండా పోతుంది. దీంతో లక్షలాదిమంది రైతులకు లాభం చేకూరుతుంది. – గంగారెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ నాయకుడు

పకడ్బందీగా అమలు చేయాలి



కేంద్రం మార్గదర్శకాల ప్రకారం పంటల కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలి. ఏటా దళారులు అమాయక రైతుల వద్ద తక్కువ ధరకు పంటలు కొనుగోలు చేసి బినామీ రైతుల పేరిట విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. – సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు

ఇంకా ఆదేశాలు రాలేదు

కేంద్ర ప్రభుత్వం నుంచి లిఖిత పూర్వకంగా ఆదేశాలు రాలేదు. ఆదేశాలు అందిన వెంటనే విధివిధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటాం. – గజానన్, మార్కెటింగ్ డీఎం

క్లుప్తంగా

టేకు కలప పట్టివేత



పట్టుకున్న కలప

ఇచ్చోడ: మండలంలోని బావోజిపేట్ అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను గురువారం తెల్లవారుజాము టైగర్‌జోన్ అటవీ అధికారులు పట్టుకున్నారు. కొందరు స్మగ్లర్లు ఎడ్లబండ్లపై అటవీ ప్రాంతం నుంచి టేకు కలప తరలిస్తున్నారని సమాచారంతో బేస్ క్యాంప్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. స్మగ్లర్లు వారిని గమనించారు. కలప తరలిస్తున్న బండ్లను అక్కడే వదిలి ఎడ్లతో పరారీ అయినట్లు సిరిచెల్మ సెక్షన్ అధికారి రాకేశ్ తెలిపారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని పేర్కొన్నారు.

ఆవు దాడిలో పలువురికి గాయాలు



చెట్టుకు కట్టేసిన ఆవు

ఇంద్రవెల్లి: ఆవు దాడిలో పలువురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మండలకేంద్రంలో సంచరిస్తున్న ఆవు పిచ్చికుక్క దాడికి గురైంది. గురువారం రహదారిపై వెళ్లేవారు, పాఠశాలకు వెళ్తున్న చావన్ గోలు(12), మతిస్థిమితం లేని కమలపై ఆవు దాడి చేసి గాయపర్చింది. కొందరిపై దాడికి యత్నించింది. గాయాలైన వారిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు.. ఆవును బంధించి ఊరి బయటకు తీసుకెళ్లి చెట్టుకు కట్టేశారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

తలమల శివారులో పులి సంచారం

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ పంచాయతీ పరిధి తలమల గ్రామ శివారులో పులి సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో అనిత తెలిపారు. జెండావెంకటాపూర్‌కు చెందిన రైతు సాయి గురువారం ఉదయం తలమల గ్రామ శివారులో తన పొలానికి వెళ్తుండగా మార్గమధ్యలో పులి కనిపించింది. వెంటనే పరిగెత్తి గ్రామస్తులకు ఈ విషయం చెప్పాడు. వారు అందించిన సమాచారంతో డీఆర్వో అల్తాఫ్, సిబ్బంది సుమలత, కలీం అటవీ ప్రాంతానికి వెళ్లారు. చిన్న నీటికుంట వద్ద పులి పాదముద్రలు లభించింది. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని ఎఫ్ఆర్వో తెలిపారు.

మాటేగాంలో చోరీ



సీసీఫుటేజీలో దుండగుడు

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామంలో చోరీ జరిగింది. ఎస్సై శంకర్, బాధితులు తెలిపిన వివరాలు.. వెంకట్‌రెడ్డి, రాజు పటేల్, శ్రావణ్‌రెడ్డి.. మందులు, ఫొటోస్టోడియో దుకాణాలను బుధవారం రాత్రి మూసివేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం వెళ్లి చూడగా కౌంటర్ తీసి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని సీసీఫుటేజీలను పరిశీలించారు. దుకాణం ఒకవైపు రేకు తొలగించి దుండగుడు లోనికి చొరబడ్డాడు. కౌంటర్‌లో రూ.1500 ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో దూకి రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య



ప్రభాకర్(ఫైల్)

తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పెద్దింటి ప్రభాకర్(64) గురువారం గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. ప్రభాకర్ గత కొంత కాలంగా తీవ్రంగా మద్యానికి బానిసకావడంతో కుటుంబ సభ్యులు తరచూ మందలించేవారు. గురువారం తీవ్రంగా మద్యం తాగిన ప్రభాకర్‌ను మందలించడంతో మనస్తాపం చెందాడు. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోయలేని భారం..

- పరీక్ష ఫీజులు పెంచిన కేయూ
- డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫీజు రూ.3250
- తగ్గించాలని విద్యార్థుల వేడుకోలు

కేయూ పరిధిలో ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	
జిల్లాలు	సంఖ్య
నిర్మల్	26
ఆదిలాబాద్	22
మంచిర్యాల	15
కుమురంభీం	5
మొత్తం	68

(సుమారు 3 వేల మంది ఫస్టియర్ చదువుతున్నారు)



లక్ష్మణచాంద: కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) పరిధిలో ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులపై ఫీజుల భారం పెరిగింది. మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్ష ఫీజు నిరుపేద, మధ్యతరగతి వారికి భారంగా మారింది. ఈ విద్యా సంవత్సరం ఈనెల 15 వరకు ఫీజు చెల్లించాలని కేయూ ప్రకటించింది. డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు గతేడాది పోల్చితే మూడింతలుగా పెరిగింది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో గత సంవత్సరం చేరిన విద్యార్థులు మొదటి సెమిస్టర్‌లో రిజిస్ట్రేషన్ ఫీజు రూ.80, ప్రాసెసింగ్ రూ.300, స్టూడెంట్ రికగ్నిషన్ రూ.300, స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్ రూ.50, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ రూ.60 ఇలా మొత్తం రూ.790 చెల్లించారు. ఈ ఏడాది రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1200, స్టూడెంట్ రికగ్నిషన్ రూ.800, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ రూ.300, స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్ రూ.200 ఇలా మొత్తం రూ.2500కు పెంచారు. దీంతోపాటు మొదటి సంవత్సరం పరీక్ష ఫీజు రూ.750 కలిపి మొత్తం రూ.3250 చెల్లించాల్సి రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చదువుకు దూరం

గత నాలుగేళ్ల నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మళ్లీ ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ రాసే విద్యార్థులకు విశ్వవిద్యాలయానికి చెల్లించాల్సిన ఫీజులను మూడింతలు పెంచింది. దీంతో చెల్లించలేక డిగ్రీ చదువులకు దూరమవుతామని పేద, మధ్యతరగతి విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం అధికారులు పెంచిన పరీక్ష ఫీజులు తగ్గించి చదువు కొనసాగించేలా చూడాలని కోరుతున్నారు.

పరీక్ష ఫీజులు కట్టలేం



డిగ్రీ ఫస్టియర్ మొదటి సెమిస్టర్ ఫీజులు కేయూ గతం కంటే మూడింతలు పెంచింది. పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారింది. ఫీజులు కట్ట లేకుండా ఉన్నాం. ఈ విషయమై విశ్వవిద్యాలయం అధికారులు పునరాలోచించాలి.

– ప్రవీణ్, డిగ్రీ ఫస్టియర్, విద్యార్థి

ప్రభుత్వం స్పందించాలి



కేయూ పెంచిన పరీక్ష ఫీజులు తగ్గించాలి. లేదంటే మధ్య తరగతి చెందిన విద్యార్థులు డిగ్రీకి దూరమయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి పరీక్ష ఫీజులు తగ్గించేలా చర్యలు చేపట్టాలి.

– ఆకుల సుధీర్, డిగ్రీ ఫస్టియర్ విద్యార్థి

ఫీజులు తగ్గించాలి



కేయూ పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫీజులు పెంచడం సరికాదు. ప్రభుత్వం పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది. పేద విద్యార్థులు చదువుకోకూడదనే కుట్ర చేస్తోంది. సెమిస్టర్ పరీక్ష ఫీజు తగ్గించాలి. లేకపోతే రాబోయే రోజుల్లో విద్యార్థుల తరపున ఉద్యమం చేస్తాం.

– కైరి శేఖర్, ఏబీవీపీ ఇందూర్ విభాగ కన్వీనర్

160 గంజాయి మొక్కలు స్వాధీనం

- నిందితుడి అరెస్ట్, రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలం అసోద గ్రామంలో సాగవుతున్న 160 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అసోద గ్రామంలో తన పొలంలో మెశ్రం భుజంగ్‌రావు అంతర పంటగా 160 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడు. పక్కా సమాచారంతో రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ ప్రత్యేక బృందంతో తనిఖీ చేపట్టి పత్తి, కంది పంట మధ్యలో ఉన్న గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.16లక్షల వరకు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. గంజాయి పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన రూరల్ సీఐ కె.ఫణిధర్, రూరల్ ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది మంగల్ సింగ్, విఠల్, సురేశ్ ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

టేకు చెట్ల నరికివేత



నరికివేతకు గురైన టేకు చెట్లు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలో స్మగ్లర్లు టేకుచెట్లను నరికివేస్తున్నట్లు తెలుస్తోంది. తాళ్లపేట్ అటవీ రేంజ్‌లోని తానిమడుగు, చింతపల్లి ప్రాంతాల్లో విలువైన టేకుచెట్లు నరికివేతకు గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గొండుగూడ బీట్‌లోని గొండుగూడ, జువ్విగూడ, పైడిపెల్లి ప్రాంతాల్లో సుమారు 20 వరకు టేకుచెట్లు నరికివేతకు గురైనట్లు తెలుస్తోంది. గ్రామాల సమీపం నుంచే చెట్లను నరికి కలపను తరలించుకుపోయారు. జువ్విగూడకు చెందిన ఓ వ్యక్తి ఈ చర్యకు పాల్పడినట్లు అధికారులు గుర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన జరిగి మూడు రోజులవుతున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఈ విషయమై జన్నారం ఇన్‌చార్జి రేంజ్ అధికారి మమతను ఫోన్‌లో సంప్రదించగా, చెట్లు నరికివేసిన వ్యక్తిని గుర్తించామన్నారు. శాఖపరమైన సమావేశాల కారణంగా చర్యలు తీసుకోకపోయామని, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.19.60 లక్షలు పట్టివేత



నగదును స్వాధీనం చేసుకున్న ఎస్సై రాజేందర్

కోటపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌లో భాగంగా మండలంలోని పార్‌పల్లి సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గురువారం నిర్వహించిన తనిఖీల్లో రూ.19.60 లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మహారాష్ట్రలోని సిరోంచా తాలుకాకు చెందిన నిఖిల్‌చందర్ గడ్చిరోలికి కారులో వెళ్తున్నాడు. ఎలాంటి ఆధారాలు, పత్రాలు లేకుండా రూ.19.60లక్షలు తరలిస్తుండగా కారు తనిఖీ చేశారు. నగదును సీజ్ చేసి కోటపల్లి తహసీల్దార్ రాఘవేందర్‌రావుకు అప్పగించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మంతెన శ్రీనివాస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల ప్రాంతానికి చెందిన మంతెన శ్రీనివాస్(49) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం ప్రకారం.. ముల్కల్లకు చెందిన శ్రీనివాస్ అనే పాల వ్యాపారి బుధవారం రాత్రి జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. రోడ్డు దాటుతున్న క్రమంలో లక్సెట్టిపేట వైపు వెళ్తున్న బైక్ వేగంగా ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ ఎగిరిపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి పంపించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య కవిత, కుమారుడు హర్షిత్, కుమార్తె హరిణీ ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..



మల్లవ్వ (ఫైల్)

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మర్రిపెల్లి మల్లవ్వ (75) మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మల్లవ్వ.. మండల కేంద్రంలోని మార్కెట్‌లో బుధవారం కారం, పసుపు విక్రయించి రాత్రి ఆటోలో గ్రామానికి చేరుకుంది. ఆటో దిగి రోడ్డు దాటేక్రమంలో గుర్తుతెలియని బైక్ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లవ్వకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఇంటికి వచ్చింది. గురువారం తెల్లవారుజామున మల్లవ్వ మృతిచెందింది. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కుంటలో పడి యువకుడి..



శ్రీనివాస్ (ఫైల్)

నిర్మల్‌రూరల్: మండలంలోని ముజిగి–చిట్యాల గ్రామాల మధ్య రహదారి వెంబడి ఓ చెట్టును ఢీకొని పక్కనే ఉన్న నీటికుంటలో పడి యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం.. దిలావర్‌పూర్ మండలం కాలువతండా గ్రామానికి చెందిన మెగావత్ శ్రీనివాస్ (25) రెండురోజుల క్రితం బైక్‌పై నిర్మల్ మండలంలోని ముజిగి గ్రామానికి బయల్దేరి వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామ సరిహద్దు వద్ద అదుపు తప్పి ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొని పక్కనే ఉన్న నీటికుంటలో పడి ఊపిరాడక చనిపోయాడు. గురువారం ఉదయం స్థానికులు గమనించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. రూరల్ ఎస్సై లింబాద్రి అక్కడికి చేరుకుని బైక్ నంబర్ ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకున్నాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో భగత్ కైలాస్ ఇంట్లో గురువారం పేకాడుతుండగా దాడిచేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.1,680 నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మానసిక స్థిరత్వం.. ప్రశాంత జీవనం

- క్షణికావేశంతో కుటుంబాలు చిన్నాభిన్నం
- ఒత్తిడి, మానసిక సంఘర్షణలో నేటి సమాజం
- ఆలోచిస్తే పరిష్కారం సులువే అంటున్న నిపుణులు
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

మానసిక ఆరోగ్య సహాయం:
టోల్ ఫ్రీ నంబర్: 14416
లేదా 1800 891 4416



నిర్మల్‌ఖిల్లా: శారీరక ఆరోగ్యం ఉన్నా, మానసిక ప్రశాంతత లేకపోతే జీవితం అస్థిరమవుతుంది. నేటి వేగవంతమైన జీవనశైలిలో స్వీయ నియంత్రణ లోపం, కుటుంబ విభేదాలు, ఆర్థిక ఇబ్బందులు, నిరుద్యోగం, అహంభావం వంటి కారణాలు మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రపంచ మానసిక ఆరోగ్యసంస్థ ఆధ్వర్యంలో 1994వ సంవత్సరం నుంచి ఏటా అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం జరుపుకొంటున్నాం. ఈ సంవత్సరం 2025 థీమ్: సమాజపు మానసిక శ్రేయస్సును బాధ్యతగా సంరక్షిద్దాం'. ఈనేపథ్యంలో సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

చిన్న విభేదాలు, పెద్ద విషాదాలు

ఇటీవల నిర్మల్ జిల్లా సహా పలు ప్రాంతాల్లో, చిన్న కుటుంబ విభేదాలు ప్రాణ నష్టాలకు దారితీస్తున్నాయి. భార్యాభర్తల మధ్య తగాదాలు, ఆర్థిక ఒత్తిడి, అనుమానాలు, అహంభావం–ఇవన్నీ కలిసిమెలిసి విషాదాంతాలు సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రులు, పిల్లలు, సోదరులు, సోదరీమణుల మధ్య కూడా చిన్న కారణాలు పెద్ద విభేదాలకు దారితీస్తున్నాయి. వ్యవసాయం, వ్యాపారం లేదా ఉద్యోగంలో నష్టాలు కూడా జీవితాలను ముగించే పరిస్థితులను తెస్తున్నాయి.

మానసిక నియంత్రణ రక్షణ కవచం

మానసిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, చాలా సమస్యలు క్షణికావేశం వల్లే విషాదానికి దారితీస్తున్నాయి. ఒక్క క్షణం మౌనం, ఆలోచనతో కుటుంబాన్ని కాపాడుకోవచ్చు. స్వీయ నియంత్రణతో మనస్సును స్థిరపర్చుకోవడం అత్యంత అవసరం. కుటుంబంలో తగాదా వచ్చినపుడు ప్రేమతో, అవగాహనతో పరిష్కారం కనుగొనాలి. కోపం, అహం విభేదాలను పెంచుతాయి. ఒక క్షణం ఆలోచిస్తే ప్రాణాలు మాత్రమే కాకుండా, సంబంధాలు, ప్రేమ కూడా నిలుస్తాయి. కాగా, జిల్లాలో భరోసా కేంద్రాలు, సఖీ, షీటీమ్ వంటి వ్యవస్థలు తోడ్పాటు నందిస్తున్నాయి. మానసిక నిపుణులు అందుబాటులో ఉన్నారు.

సరైన సాంత్వన అవసరం



యువత, మధ్యవయస్కులు చిన్నచిన్న విషయాలకు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. కలిసి మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. కుటుంబ పెద్దలు, స్నేహితులు, మానసిక నిపుణుల సహాయం తీసుకుంటే సమస్యల నుంచి బయటపడవచ్చు. మానసిక సాంత్వన ద్వారానే ఈ పరిస్థితులను అధిగమించగలం.

– డాక్టర్ అల్లాడి సురేశ్, మానసిక వైద్యనిపుణులు, నిర్మల్

అనుబంధాలు బలపర్చుకోవాలి



ప్రతిరోజూ కొంత మనస్సుకు నచ్చిన పనులకు కేటాయించాలి. నెగిటివ్ ఆలోచనలను దూరంగా ఉండాలి. సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలి. స్నేహితులు, కుటుంబ సభ్యులతో అనుబంధాలను బలపర్చాలి. ఒత్తిడి ఉంటే ధ్యానం, యోగా, నడక చేయాలి.

– డా.టి.సంపత్‌కుమార్, నవలా రచయిత, నిర్మల్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



అక్షయ్ (ఫైల్)

భైంసాటౌన్/బాసర: భైంసాలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఆగ్రే అక్షయ్ (27) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బాసర సీఐ టి.సాయికుమార్ కథనం ప్రకారం.. అక్షయ్ గురువారం సాయంత్రం బాసర వైపు నుంచి భైంసాకు వస్తుండగా టాక్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న అక్షయ్‌కు తీవ్ర గాయాలు కాగా, గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. కాగా, అప్పటికే అక్షయ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అక్షయ్ మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా, పులేనగర్‌లో నివాసముంటున్నాడు. అతని మృతిపై కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక




ఎంపికైన జగదీశ్‌తో హెచ్ఎం రమేశ్, పీడీ రాజయ్య

మంచిర్యాల అర్బన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి చిప్పకుర్తి జగదీష్ 57–60 కిలోల విభాగంలో అండర్–17లో బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో జరిగిన జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. ఈనెల 10న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడు. హెచ్‌ఎం బండి రమేశ్, పీడీ రాజయ్య గురువారం జగదీశ్‌ను అభినందించారు.

సెల్‌ఫోన్ చోరీకి యత్నించిన యువకుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: సెల్‌ఫోన్ చోరీకి యత్నించిన బీహార్‌కు చెందిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన సయ్యద్ సాదిక్ అలీ బుధవారం సాయంత్రం రైతు బజార్‌లో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో షేక్ అజ్మీర్.. సయ్యద్ సాదిక్ అలీ జేబులోని సెల్‌ఫోన్ చోరీకి ప్రయత్నించాడు. గమనించిన సాదిక్ అలీ అతన్ని పట్టుకుని పో లీసుస్టేషన్‌లో అప్పగించారు. ఆయన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పశువుల మేతగా పత్తి చేలు



భోరజ్ మండలం తర్నం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలు పశువుల మేతగా మారిపోయాయి. ఒకప్పుడు పచ్చగా కళకళలాడిన చేన్లు.. ఇప్పుడు పశువులను మేపే ప్రదేశాలుగా మారాయి. పశువుల మేతకే వాటిని వదిలేశామని రైతులు పేర్కొంటున్నారు. – సాత్నాల

నిలకడగా నీటిమట్టం



కడెం ప్రాజెక్ట్ నీటిమట్టం గత కొన్నిరోజులుగా నీటితో నిలకడగా..నిండుకుండలా కొనసాగుతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, గురువారం 699.975 అడుగులుగా ఉంది. – కడెం

కేసుల దర్యాప్తులో అలసత్వం వహించొద్దు



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

కోటపల్లి: కేసుల దర్యాప్తులో అధికారులు అలసత్వం వహించొద్దని, ప్రజాఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు. గురువారం ఆయన కోటపల్లి పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందిస్తూ సంఘటన స్థలానికి చేరుకోవాలని తెలిపారు. అనంతరం కోటపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ బన్సిలాల్, ఎస్సై రాజేందర్ పాల్గొన్నారు.

గొప్ప లక్ష్యాలు ఎంచుకోవాలి

చెన్నూర్‌రూరల్: విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో రాణించేందుకు గొప్ప లక్ష్యాలను ఎంచుకోవాలని డీసీపీ భాస్కర్ అన్నారు. మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కేరియర్ గైడెన్స్ అనే అంశంపై గురువారం జీకే పరీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీసీపీ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్‌రావు, ఎంపీడీవో మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ ఎంవి.పట్వర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా, డీసీపీ భాస్కర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ ఉన్నారు.

ఎలక్ట్రిక్ వాహనం బ్యాటరీల చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్‌లో షాహిద్ అహ్మద్ తవక్కల్ ఇంటి ముందున్న ఎలక్ట్రిక్ వాహనం నుంచి బ్యాటరీలు, రెండు ఛార్జర్లు, ఆటోలో అమర్చిన రెండు బ్యాటరీలను బుధవారం రాత్రి చోరీకి గురయ్యాయి. బాధితుడి షాహిద్ అహ్మద్ ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా వడ్డెర కాలనీకి చెందిన మంజుల ఈశ్వర్‌ను గుర్తించి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అతని నుంచి బ్యాటరీలు, ఛార్జర్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

జిల్లాస్థాయి టెబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్ల జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–17, 14 బాల, బాలికల జిల్లాస్థాయి టెబుల్ టెన్నిస్ పోటీలను జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్ గురువారం ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్–14 బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో సుప్రతిక్‌వర్మ(అల్ఫోర్ మంచిర్యాల), ద్వితీయ స్థానంలో సాయిశృత్విక్ (ముల్కల్ల జెడ్పీ పాఠశాల), బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో సాద్వి(ఓరియంట్ దేవాపూర్ పాఠశాల), ద్వితీయ స్థానంలో సావిత్రీ, శ్రావణి (కార్మల్ పాఠశాల–మంచిర్యాల)లు నిలిచారు. అండర్–17 బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో సాయివివేక్(ఎంజేపీ–లక్సెట్టిపేట), ద్వితీయ స్థానంలో ధనుష్(ఎంజేపీ–లక్సెట్టిపేట), బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో సత్యచతుర్వేది(కార్మల్ పాఠశాల–మంచిర్యాల), ద్వితీయ స్థానంలో నక్షత్ర (ఓరియంట్ దేవాపూర్ పాఠశాల) నిలిచారు. వీరు త్వరలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరగబోయే జోనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హెచ్‌ఎం రాజేశం పాల్గొన్నారు.


కుమార్తె నితారాతో అక్షయ్ కుమార్

సైబర్ వలయం
ముందే పాఠం నేర్చుకుందాం


ఇప్పుడు ప్రపంచం వైఫైలో బందీ!
ఆ వైఫైయే సెల్‌ఫోన్‌కు ఆహారం..
ఆ సెల్‌ఫోనే అందరికీ ప్రాణాధారం!
రియల్ లైఫ్ కన్నా వర్చువల్ వరల్డ్‌లోనే శ్వాసిస్తున్నాం!
పిల్లలకైతే చెప్పక్కరలేదు..
చదువు - సంధ్య, ఆట - పాట అంతా డిజిటల్ డివైజే!
అందుకే ఆన్‌లైన్‌లో అవతలివైపు వాళ్లకు
అవలీలగా దొరికిపోతున్నారు..
ఆటవస్తువులుగా మారుతున్నారు!
ఈ ప్రమాదానికి సెలబ్రిటీల పిల్లలూ వల్నరబులే..
ప్రైవసీ కంచె వాళ్లను కాపాడలేకుంది!
తాజా ఉదాహరణ.. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్
కూతురు నితారా కుమార్‌కు ఎదురైన అనుభవమే!

అక్షయ్ కుమార్ కూతురు నితారాకు పదమూడేళ్లు. అందరి పిల్లల్లాగే ఆ అమ్మాయికీ ఆన్‌లైన్ గేమ్స్ అంటే మహా ఇష్టం. అమ్మ ట్వింకిల్ ఖన్నా అనుమతితో రోజులో కొంచెంసేపు ఆన్‌లైన్ గేమ్స్‌తో ఎంటర్‌టైన్ అవుతూంటుంది. ఎప్పటిలాగే ఆ రోజూ గేమ్‌స్టార్ట్ చేసింది. అవతలి వైపు నుంచి ఓ అపరిచితుడు అమ్మాయికి గేమ్ పార్ట్‌నర్‌గా చేరాడు. గేమ్ ఆడుతూ నితారాతో సంభాషణ మొదలుపెట్టాడు. 'చాలా స్మార్ట్‌గా ఆడుతున్నావ్.. వెరీ గుడ్' అంటూ ప్రశంసించాడు. 'థాంక్స్' చెప్పింది నితారా. ఇంకో రెండుమూడు క్యాజువల్ మాటల తర్వాత 'నువ్వు అమ్మాయివా? అబ్బాయివా?' అంటూ అడ్వాన్స్ అయ్యాడు. 'అమ్మాయిని' అంటూ బదులిచ్చింది నితారా. 'ఒకసారి నీ ఫొటోగ్రాఫ్స్ పంపవా?' అని అడిగాడు. ఏదో అపశ్రుతి పసిగట్టిన ఆ అమ్మాయి వెంటనే డివైజ్ షట్‌డౌన్ చేసి, విషయాన్ని తల్లికి చెప్పింది. 'నా కూతురు చేసిన తెలివైన పని అదే. డివైజ్ క్లోజ్ చేసి ఆ ఆన్‌లైన్ అబ్యూజ్‌ను తల్లితో షేర్ చేసుకోవడం' అంటాడు అక్షయ్ కుమార్. సైబర్ అవేర్‌నెస్ మంత్ క్యాంపెయిన్‌లో మాట్లాడుతూ తన కూతురు ఎదుర్కొన్న పరిస్థితిని వివరించాడు అక్షయ్ కుమార్.


సుహానా ఖాన్, షారూఖ్ ఖాన్, గౌరీఖాన్


అజయ్ దేవ్‌గన్, నైసా, కాజోల్


అభిషేక్, ఐశ్వర్య, ఆరాధ్య


అనుష్క, విరాట్, వమికా

పాఠ్యాంశంగా..

అక్షయ్, ట్వింకిల్ ఖన్నా ఇద్దరూ క్రమశిక్షణకు మారుపేరు. పిల్లలిద్దరినీ మీడియాకు దూరంగానే ఉంచుతారు. వాళ్ల ప్రైవసీకే ప్రాధాన్యం ఇస్తారు. అయినా నితారా ఆన్‌లైన్ అబ్యూజ్‌ను ఎదుర్కొంది. అంత కంటికి రెప్పలా కాచుకుంటేనే ఇలాంటి సిచ్యుయేషన్ వస్తే.. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేసే ఇళ్లల్లో పిల్లల సంగతి ఎలా ఉంటుందో!

24 గంటలు కాదు కదా.. కనీసం ఇంట్లో ఉన్నప్పుడు కూడా పర్యవేక్షించలేనంత బిజీగా ఉంటున్నారు పేరెంట్స్. అందుకే స్కూళ్లలో సైబర్ సేఫ్టీని పాఠ్యాంశంగా చేర్చాలంటున్నాడు అక్షయ్ కుమార్.

ఎందుకంటే పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ లేకపోతే సైబర్ ట్రోలింగ్, బుల్లీయింగ్, అబ్యూజ్‌కి గురయ్యే ప్రమాదం ఎలాగూ ఉంటుంది. దానితోపాటు అది పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం పై, వాళ్ల సోషల్ బిహేవియర్ మీదా దుష్ప్రభావం చూపిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి అక్షయ్ కుమార్ చెప్పినట్టు పిల్లలకు బడిలో పుస్తక పాఠాలతోపాటు సైబర్ బిహేవియర్ జాగ్రత్తలనూ నేర్పించాలని చైల్డ్ సైకాలజిస్టులూ సూచిస్తున్నారు. అంతేకాదు పెద్దలకూ ఆన్‌లైన్ అవేర్‌నెస్ మీద వర్క్‌షాప్స్‌ను నిర్వహించాలని.. సైబర్ క్రైమ్ పోలీసులే దీని మీద చొరవ చూపాలని కోరుతున్నారు.

> కనీస అవసరాల నుంచి ఫ్లయిట్ టికెట్స్ దాకా, బడి పాఠాల నుంచి ప్రొఫెషనల్ మీటింగ్స్ దాకా అన్నిటికీ ఆన్‌లైనే మాధ్యమం. అలాంటి ఈ డిజిటల్ యుగంలో పిల్లల జోక్యాన్ని నివారించడం అసాధ్యమే. కానీ దాని మంచి చెడు, వ్యక్తిగత డేటాను ఎలా కాపాడుకోవాలి, ఆన్‌లైన్ భద్రత కోసం ఏం చేయాలి.. వంటి అంశాల మీద అవగాహన కల్పించడం మాత్రం సాధ్యమే! అత్యవసరం కూడా!

వీళ్లు కూడా..

షారూఖ్ ఖాన్ కూతురు సుహానా ఖాన్ నుంచి కాజోల్, అజయ్ దేవ్‌గన్‌ల కూతురు నైసా దేవ్‌గన్, ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల కూతురు ఆరాధ్యా బచ్చన్, అనూష్కా శర్మ, విరాట్ కొహ్లీల కూతురు పసికూన వమికా దాకా అందరూ ఆన్‌లైన్ ట్రోలింగ్, బుల్లీయింగ్‌కి గురైనవారే. సుహానా ఖాన్ ఒంటి రంగు, యాక్టింగ్ స్కిల్స్‌ను వెక్కిరిస్తూ ట్రోల్ చేశారు. నైసా దేవ్‌గన్ కూడా ఒంటిరంగు పట్ల ఆన్‌లైన్ హేళనకు గురైంది. ఆరాధ్యనయితే బాడీషేమింగ్ చేశారు. కెమెరా ముందు నిలబడటం రాదని ఎద్దేవా చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకుని ఐశ్వర్య సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మాటలు, వెక్కిరింతలు ఆరాధ్య మనసును గాయపరచి ఆమె మానసిక ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తాయని.. ఐశ్వర్య కూతురిని డిజిటల్ మాధ్యమానికి దూరంగా ఉంచారు. కనీసం ఫోన్ కూడా వాడదు ఆరాధ్య. ఈ విషయాన్ని ఒక సందర్భంలో స్వయంగా అభిషేక్ బచ్చనే ప్రస్తావించారు. భార్యకు బెస్ట్ మదర్‌గా కితాబూ ఇచ్చారు. నటులు దియా మిర్జా, సమీరా రెడ్డి కూడా పేరెంట్స్‌గా.. పిల్లల స్క్రీన్ టైమ్ మీద నియంత్రణ ఉండాలని, దాన్నెలా ఫాలో కావాలో, పేరెంటింగ్‌లో ఎలా భాగం చేయాలో పేరెంట్స్‌కి నిపుణులు వర్క్‌షాపులు నిర్వహించి అవగాహన పెంపొందించాలని కోరుతున్నారు.



కేర్‌గివర్
రాణి అనే నేను
ఇజ్రాయెల్ నుంచి మాట్లాడుతున్నాను...

ఇజ్రాయెల్ అనే మాట వినిపించగానే యుద్ధబీభత్సాలు, దాడులు గుర్తుకు వస్తాయి. కొద్దిమంది నెటిజనులకు మాత్రం ఇజ్రాయెల్ అనగానే టక్కున గుర్తుకు వచ్చే పేరు రాణి గోర్సెర. 'ఇజ్రాయెల్‌లో కేర్‌గివర్‌గా పనిచేస్తున్నాను' అని చెప్పే రాణి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది.

ఎప్పటికప్పుడూ ఆసక్తికరమైన వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది.

'కేర్‌గివర్'గా వృద్ధులను కన్నబిడ్డలా చూసుకుంటుంది. ఇళ్లు శుభ్రం చేయడం, వంట చేయడం, వృద్ధులతో కబుర్లు చెప్పడం... ఇలా ఎన్నో చేస్తూ ఉంటుంది.

'కేర్‌గివర్‌గా నా జీవితంలో ఒకరోజు' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన వీడియోలో కబుర్లు చెబుతూ, నవ్విస్తూ, ఒక వృద్ధురాలి కాళ్లని శుభ్రం చేయడం, నెయిల్ పెయింట్ వేయడం.. .మొదలైన దృశ్యాలు కనిపిస్తాయి.

నవరాత్రి ఉత్సవాలలో ఉత్సాహంగా నృత్యం చేయడం మరో వీడియోలో కనిపిస్తుంది.

'చాలామంది వృద్ధులు ఒంటరితనం అనే దీవిలో దిగులుగా జీవిస్తున్నారు. అలాంటి వారికి రాణిలాంటి వారు సరికొత్త జీవనోత్సాహాన్ని ఇస్తున్నారు. వృత్తిపరంగా ఆమె కేర్‌గివర్ కావచ్చు గానీ వృద్ధులకు ఆమె ఆత్మీయతను పంచే కన్నకూతురు' అని ఒక నెటిజన్ కామెంట్ రాశారు.

జర్నీ
భారత్ పిలిచింది!



బ్రెయిన్ ట్యూమర్ బారిన పడిన యూకే అథ్లెట్ జాక్ ఫెంట్‌కు ప్రతికూల ఆలోచనలు వస్తుండేవి. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన ఇండియా గుర్తుకు వచ్చింది. వెంటనే రంగంలో దిగాడు.

'ఇండియా–80 రోజులు–4,000 కిలోమీటర్‌లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు.

ఇండియాలోకి అడుగు పెట్టిన క్షణం నుంచి అతడిలో ఉత్సాహం మొదలైంది. ఇండియాలో తన '80 -డే రన్' తాలూకు వీడియోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. 'ప్రొటెక్టర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన వీడియోలో తనను ప్రమాదం నుంచి రక్షించిన వీధి శునకం గురించి చెప్పాడు.

ఆ శునకంతో తనతోపాటు పదమూడు కిలోమీటర్‌లు నడిచింది. దానికి 'మనాలి' అని పేరు పెట్టాడు జాక్.

'80 రోజులలో రోజుకు 50 కిలోమీటర్‌ల దూరం పరుగెత్తడానికి ఇండియాకు ప్రయాణమవుతున్నాను. మంచుతో కప్పబడిన కొండల నుంచి కేరళ ప్రకృతి అందాల వరకు ఎన్నో చూడబోతున్నాను. బ్రెయిన్ ట్యూమర్ అని నాకు నిర్ధారణ అయిన తరువాత నా మనసు భయం, గందరగోళం, దుఃఖంతో నిండిపోయింది. నాకే కాదు భూమి మీద ప్రతి ఒక్కరికీ కష్టాలు కూడా ఉంటాయి. దీంతోపాటు ఒక ఆప్షన్ కూడా ఉంటుంది. ఇండియాకు వెళ్లాలనుకోవడం అనేది నా ఎంపిక. మళ్లీ పూర్వంలా ఉత్సాహంగా ఉండాలనుకుంటున్నాను'' అని తన యాత్ర ప్రారంభానికి ముందు షేర్ చేసిన పోస్ట్‌లో రాశాడు జాక్ పెయింట్.





ఫ్యాషన్
● ఇయర్ చెయిన్స్
మెరిసే సరాలు



రమణుల ఆభరణాల అలంకరణలో చెవుల నుంచి హెయిర్ వరకు లేయర్లుగా చెయిన్ ఉండటం ఫ్యాషన్ మాత్రమే కాదు మన సంస్కృతి, సౌందర్యం, ఆచారం కూడా.
దక్షిణ భారతదేశంలో చెంపసరాలు, మాటీలుగా పేరున్న ఈ ఇయర్ చెయిన్స్ బాలీవుడ్ నుంచి టాలీవుడ్ సెలబ్రిటీల వరకు ఇప్పుడు స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.
ఇటీవల దుర్గా నవరాత్రుల్లో సెలబ్రిటీలు ధరించిన మాటీల అందం నవతరపు చూపులను ఇట్టే కట్టిపడేసింది.
ప్రాచీన ఆభరణంగా, అలంకరణలో సంపూర్ణతకు చిహ్నంగా నిలిచే మాటీలు వివాహ వేడుకలలో వధువు సింగారంలో తప్పనిసరై వెలుగొందుతోంది.
పండగల రోజులలో ధరించిన డ్రెస్సుల తగిన ట్రెండీ మోడల్స్ కూడా ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి.
బంగారం, డైమండ్స్‌లోనే కాదు వివిధ రకాల పూసలు, సిల్వర్, ఆక్సిడైజ్‌లలోనూ ఈ మాటీల అందం మనసు దోచేస్తుంది.







సాంప్రదాయ ఆభరణాలకు మోడర్న్ మెరుపులు జోడించడమే ఈ ఇయర్ చెయిన్స్. ఒకప్పుడు దేవతల విగ్రహాల్లో, అమ్మమ్మల చెవులకు కనిపించిన చెంప సరాలు ఇప్పుడు రన్ వే వేదికలపై అడుగులు వేసే మోడల్స్ చెవుల్లో, మ్యాజిక్ ఫెస్టివల్ లుక్స్‌లో, బ్రైడల్ ఫొటోషూట్లలో కొత్త శైలిలో మెరిసిపోతున్నాయి. దక్షిణ భారతీయ సంప్రదాయాల్లో చెంప సరాలు (ఇయర్ చెయిన్)ఒక ముఖ్యమైన అలంకారం. నాటి కాలంలో మహిళల గౌరవం, ఆభరణ సంపూర్ణతకు చిహ్నంగా వెలుగొందిన చెంప సరాలు రాబోయే వేడుకలలో మరిన్ని ఆకర్షణలను జోడించనున్నాయి.

■ అద్దుకున్న ఆధునికత

ఈ రోజుల్లో ఆ చెంప సరాలు కొత్త రూపాల్లో కనిపిస్తున్నాయి. సిల్వర్, ఆక్సిడైజ్డ్, మెరూన్ కలర్ పూసలు, ముత్యాల చెయిన్లు, ఫ్యూషన్ ఫ్యాషన్‌లో కూడా ఇయర్ చెయిన్స్ స్పెషల్ లుక్ ఇస్తున్నాయి. సాదా సీదా కుర్తా మీదకైనా, లెహంగా లేదా



చీర ధరించినా ఆభరణాల అలంకరణలో ఇయర్ చెయిన్ అందం జత చేరితే ఆ అందం ఇనుమడిస్తుంది.

■ శక్తి సరాలు..

ఇది కేవలం అలంకారం కాదు. చెవులు-జుట్టు ప్రదేశంలో ఈ సరాలు కదలడం మన ప్రాణశక్తిని సమతుల్యం చేస్తుందని చెబుతారు. అందుకే కొంతమంది దీనిని 'శక్తి సరాలు'గా భావిస్తారు.

■ సెలబ్రిటీల స్టైల్ టచ్

బాహుబలి సినిమాలో అనుష్క ధరించిన చెవి జూకాలు, చెంప సరాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. అలాగే, ఇటీవల దుర్గా నవరాత్రుల్లో బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు సెలబ్రిటీలైన అలియా భట్, జాన్వికపూర్, సోనమ్‌కపూర్, శోభిత ధూళిపాల, నయనతార... లాంటి నటీమణులు తమ ట్రెడిషనల్ ఫొటోషూట్లలో ఇయర్ చెయిన్స్ ధరించి ట్రెండ్ సెట్ చేశారు. ఆ లుక్స్ వల్లే ఈ పాత ఆభరణం మళ్లీ యంగ్ జనరేషన్‌లో పాపులర్ అయింది. పాత ఆభరణానికి కొత్త రూపం దక్కింది. ఇప్పుడు వాటి డిజైన్, మెటీరియల్, వాడుక అన్నీ ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త భాషను పరిచయం చేస్తున్నాయి.

ఇప్పుడు కొంతమంది కళాకారులు రీసైకిల్ మెటల్, హ్యాండ్ మేడ్ ఫ్యాబ్రిక్ థ్రెడ్స్‌తోనూ వీటిని రూపొందిస్తున్నారు. అమ్మమ్మల నాటి సంప్రదాయ నెమలి, మామిడిపిందెల నుంచి ప్రారంభమైన చెంప సరాల డిజైన్లు ఈ రోజుల్లో ఇయర్ కఫ్స్ వరకు వినూత్నంగా కళ్లకు కడుతున్నాయి.



మనసు మాట విందాం!

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

మన సమాజంలో దగ్గు, జలుబు, జ్వరం, షుగర్, బీపీ అంటే వెంటనే డాక్టర్ దగ్గరకు వెళ్తారు. కానీ డిప్రెషన్, ఆందోళన, పానిక్ అటాక్, డీ-పర్సనలైజేషన్ లాంటి వాటిని బలహీనతలు లేదా అలసత్వంగా చూస్తారు. అవేవో బాధితులు కావాలని తెచ్చిపెట్టుకున్నట్టు భావిస్తారు. కానీ నిజానికి మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానమే. ఇవి రెండూ పరస్పర ఆధారితాలు.

తలనొప్పి, తల తిరుగుడు, వాంతులు, జీర్ణ సంబంధ ఇబ్బందులు, గుండె అత్యంత వేగంగా కొట్టుకోవడం, ముఖ కండరాలు అదరడం, చర్మం పాలిపోవడం లాంటి శారీరక లక్షణాల ద్వారా మానసిక వ్యాధులు వ్యక్తం అవుతాయి. అంటే, మనసు తాను అనుభవించే హింసను గుర్తించమని, త్వరగా ఈ బాధను తగ్గించే ఉపాయం చూడమని శరీరం ద్వారా వేడుకుంటుంది! కానీ పట్టించుకోం మనం. ఎందుకంటే, బాధితులు ఆ వ్యాధులకు సంబంధించిన మందులు తీసుకుంటే వాటికి బానిసలవుతారని, ఈ వ్యాధులు పూర్తిగా నయం కావనీ. నిజానికి ఇవన్నీ తప్పుడు భావనలు.

మానసిక వ్యాధులు కూడా శారీరక వ్యాధుల్లానే అనేక కారణాల వల్ల రావచ్చు. మెదడు రసాయనాల అసమతుల్యత, వంశపారంపర్యం, ఒత్తిడి, పరిసరాలు వంటి అంశాలు దీనికి కారణం అవుతాయి. కనుగొనదగిన కారణాలు ఏమీ లేకుండా కూడా మానసిక వ్యాధులు రావచ్చు. తొలిదశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స చేస్తే, బాధితులు సాధారణ జీవితం గడపవచ్చు.

పిల్లలు, యువకులు, పెద్దలు ఎవరికి అయినా మానసిక సమస్యలు రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, 2021లో ప్రపంచంలో సుమారు 1.1 బిలియన్ మంది మానసిక వ్యాధుల బారినపడ్డారు (ప్రతి ఎనిమిది మందిలో ఒకరు) అసలు మీరు పని చేసేచోట, సంచరించే చోట మీకు తెలియకుండా ఇప్పటికే ఒకరిద్దరు డిప్రెషన్‌తోనో, ఏంగ్జయిటీతోనో వుండి ఉండొచ్చు. రోజువారీ జీవితంలో అవరోధం కలగనంతవరకూ పరవాలేదు. సమస్య వస్తే మాత్రం, దాచుకోవడం కంటే కుటుంబ సభ్యుల, స్నేహితుల, సహకారం తీసుకోవడం, వైద్యుని సంప్రదించడం ఎంతో అవసరం.

> ప్రపంచ ప్రసిద్ధ వ్యక్తుల్లో అబ్రహాం లింకన్, ఐజాక్ న్యూటన్, విన్సెంట్ వ్యాన్గో, చార్లెస్ డికెన్స్ నుంచీ మన దీపికా పదుకొనే వరకూ ఎందరో గొప్ప వ్యక్తులు, సెలబ్రిటీలు మానసిక వ్యాధులతో పోరాడి, సాధారణ స్థాయిని మించి ఉన్నతంగా బతకడమే కాకుండా, తమ ప్రతిభతో లోకానికి ప్రేరణగా నిలిచారు. మానసిక రోగులు చాలా వరకు ప్రమాదకారులు కాదు; మందులు వైద్యుని సూచన మేరకు తీసుకుంటే అడిక్షన్ రాదు.

అన్నిటికన్నా ముఖ్యమైన సంగతి, మానసిక ఆరోగ్య సమస్యలు ''నిజమైనవి'' అనే విషయాన్ని గ్రహించడం, అంగీకరించడం. జ్వరం వస్తే విశ్రాంతి తీసుకుంటాం కదా! అలాగే, మనసు అలసిపోయినప్పుడు, అది బాధపడినప్పుడు కూడా సహాయం కోరడం సిగ్గుపడాల్సిన విషయం కాదు. ధైర్యం, అవగాహన అవసరమయ్యే విషయం. మనసుని ఖాళీగా ఉంచకుండా మంచి వ్యాపకాలు పెట్టుకోవాలి. గ్రౌండింగ్ టెక్నిక్స్, బ్రీతింగ్ వ్యాయామాలు నేర్చుకోవాలి..

సర్వమానవ సహోదరత్వం, సౌభ్రాతృత్వం గురించి ఉపన్యాసాలు దంచేస్తాం. మనలో అది నిజంగా వుందని నిరూపించుకునే చిన్న అవకాశం ఒకటి ఏమిటంటే, మానసిక వ్యాధులతో బాధపడేవారిని చూసి ఎగతాళిగా నవ్వకుండా, తప్పుగా మాట్లాడకుండా ఉండటం, వాళ్లకి చేతనైన సహాయం చెయ్యడం.

ఆమాత్రం చేయలేమా?


వైష్ణవి గద్దె, వైద్య విద్యార్థిని

బులియన్
బంగారం 10 గ్రా.: వెండి కిలో
అక్టోబర్ 10న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,29,410	బంగారం (24 క్యారెట్లు)	1,26,250	బంగారం (24 క్యారెట్లు)	1,24,150	బంగారం (24 క్యారెట్లు)	1,26,250.	బంగారం (24 క్యారెట్లు)	1,28,000	బంగారం (24 క్యారెట్లు)	1,24,370
బంగారం (22 క్యారెట్లు)	1,17,340	బంగారం (22 క్యారెట్లు)	1,13,380	బంగారం (22 క్యారెట్లు)	1,13,800	బంగారం (22 క్యారెట్లు)	1,17,210	బంగారం (22 క్యారెట్లు)	1,17,700	బంగారం (22 క్యారెట్లు)	1,14,000
వెండి	1,70,000	వెండి	1,58,600	వెండి	1,67,000	వెండి	1,58,600	వెండి	1,60,000	వెండి	1,71,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.